
# జోగిని



'ఇండియా టుడే' వారపత్రిక . . . 25 – 31 అక్టోబర్, 2000

"దండాలు బాబూ!"

– అంటూ వచ్చింది కమలమ్మ.

"ఏం కమలమ్మా... బాగున్నావా?" అని అడిగాడు మైసయ్య– వాలుకుర్చీలో తల వెనుక చేతులు కట్టుకు కూర్చుని.

"ఏదో బాగానే ఉన్నాంలే బాబూ... తమ బోంట్ల దయ వల్ల!" అంది కమలమ్మ అసహ్యాన్ని లోపలే అణచుకుంటూ.

"మళ్లీ 'బోంట్లు' ఎందుకు? తమ దయ వల్ల అను చాలు!" అంటూ దరువు వేశాడు రామలింగం.

"బాబుగారు ఎందుకో పిలిపించారంటే వచ్చాను!" అంది కమలమ్మ.

"అవును... నీ కూతురు సరోజ టెన్త్ ప్యాసయిందటగా?"

"అవును బాబూ!"

"మరి, ఏం చేయాలనుకుంటున్నావు? పైచదువులు చదివిస్తావా, పెళ్ళి చేస్తావా?"

"దానికి చదువు బాగా వస్తోంది బాబూ! గవర్నమెంటు కూడా మా పిల్లలకు ఖర్చు లేకుండా చదువు చెప్పిస్తోంది. అది చదువుకుంటాననంటోంది. నాకైతే మంచి సంబంధం వస్తే పెళ్ళి చేయాలనే ఉంది. నేను ఎన్నాళ్లు ఉంటానో, ఏమో! నేనుండగానే దాన్నో అయ్య చేతిలో పెట్టే దిగులుండదు."

"నన్నడిగితే దానికి చదువూ వద్దూ, పెళ్లీ వద్దు అంటాను..." అన్నాడు మైసయ్య.

'నిన్నడిగే దెవరోయి బోడీ! నువ్వంతకంటే మంచిమాట చెప్తావా ఏమన్నానా?' అని మనసులోనే అనుకున్నాడు రామలింగం.

"అదేమిటి బాబూ... అలాగంటారు!" అంది కమలమ్మ బాధగా.

అంతలో... లోపల్నుంచి శాంతమ్మ బయటకు వచ్చింది.

"ఆడగొంతు వినిపిస్తుంటే ఎవరాని బయటకు వచ్చాను. నువ్వా కమలమ్మా... బాగున్నావా?" అంది.

"తమ దయ వల్ల బాగానే ఉన్నాం అమ్మగారూ!"

"అమ్మాయి పరీక్ష ప్యాసయిందటగా– మంచి సంబంధం చూసి పెళ్ళి చేసేయి!"

"అదైతే చదువుకుంటాననంటోంది. అయినా, మంచి సంబంధం రావాలి కదమ్మ గారూ... వస్తే తప్పక చేసేస్తాను."

"వస్తే సరే! రాకపోతే చదువు చెప్పించు."

"ఇక్కడ నిన్నెవరూ సలహా అడగలేదు. చదువు చెప్పించాలో, పెళ్ళి చేయాలో కమలమ్మ చూసుకుంటుంది. 'తగుదునమ్మా...' అంటూ తీర్పు చెప్పడానికి వచ్చావు!" అంటూ భార్య మీద రుసరుసలాడాడు మైసయ్య.

'ఆ రెండింటిలో ఏదైనా అయ్యగారికి బాధే కదా!' అని మనసులో అనుకున్నాడు రామలింగం.

భర్త వంక అసహ్యంగా చూసి, లోపలికి వెళ్లిపోయింది శాంతమ్మ.

"ఆడగొంతు వినిపిస్తే చాలు– అనుమానం వీళ్ళకి! అందుకే అన్నారు... 'అసూయ ముందు– ఆ తర్వాత ఆడది...' అని!" తన జోక్‌కి తానే మురిసిపోతూ రామలింగం వైపు ఓరగా చూశాడు మైసయ్య.

"అయ్యగారు ఊరిపెద్ద! ఆయన ఏం చెప్పినా అందరి మంచికోసం చెప్తారు. ఆయన చెప్పేది జాగ్రత్తగా విను!" అన్నాడు రామలింగం.

"నేను చెప్పేది శాంతంగా ఆలకించు కమలమ్మా! అమ్మాయి ఇష్టప్రకారం పైచదువులు చదివించావనుకో, ఉద్యోగం కూడా వచ్చిందనుకో... ఆడదన్న తర్వాత పెళ్ళి చేయక తప్పదుగా– పెళ్ళి చేశాక అమ్మాయి సంపాదనలో ఓ పైస నీ చేతికి ఇస్తానంటే ఆ మొగుడు ముండాకొడుకు ఒప్పుకుంటాడా? ఇన్నాళ్లూ నువ్వు పడ్డ శ్రమ, చేసిన చాకిరీ, పెట్టిన ఖర్చూ– అన్నీ దండగేగా?"

"మంచి సంబంధం రాకపోతే చదువు చెప్పిస్తాను. మంచి సంబంధం వస్తే అతగాడి ఇష్టం! చదివించమంటే చదివిస్తాను... వద్దంటే మానిపిస్తాను. అటు పెళ్ళీ కాక, ఇటు చదువూ చెప్పించక ఇంట్లో ఖాళీగా కూర్చోబెట్టలేనుగా! అయినా, మా తిప్పలేవో మేం పడ్తాంలే బాబూ... మా పేదోళ్ళ సమస్యలు తమకెందుకు?"

"ఊరిపెద్ద అన్నాక అందరి మంచీ, చెడూ ఆయనే చూడాలి! అందుకే నువ్వు అడక్కపోయినా తానే పిలిపించి నీ ఇబ్బందీ, సబ్బందీ కనుక్కుంటున్నాడు దొర!" అన్నాడు రామలింగం దరువేస్తూ.

కమలమ్మ ఏమీ మాట్లాడలేదు.

"అందుకే నేను చెప్తున్నాను విను. నీ కూతురికి మంచి సంబంధం తేవాలనుకుంటున్నావు. మంచిదే! కానీ, రావద్దూ..? మనలో మన మాట... నువ్వు ఈ ఊరి ఎల్లమ్మ తల్లికి జోగినిగా బతికావు. దేవతకి జీవితం అంకితం చేయడం ఎంత పుణ్యం! సరే... ఓ మారాజు పుణ్యమాని నీకు ఆడపిల్ల పుట్టింది. 'సరోజ' అని పేరు పెట్టుకుని

అల్లారుముద్దుగా పెంచుకున్నావు- బాగానే ఉంది! అయితే... నీకు పుట్టిన కూతుర్ని చేసుకోవడానికి మంచి సంబంధం ఎలా వస్తుంది? నువ్వే చెప్పు?"

"అదేమిటి బాబూ! ఎల్లమ్మ తల్లికి అంకితం కావడం ఎంతో పుణ్యం అని తమరే అన్నారు. అలాంటి నాకు పుట్టిన పిల్ల పనికిరానిదెలా అవుతుంది బాబూ?"

'బాగా అన్నావు! అట్లకాడ కాల్చి గట్టిగా వాత పెట్టావు వెధవకి!' అని మనసులో అనుకున్నాడు రామలింగం.

"అని నువ్వూ, నేనూ అనుకుంటే సరిపోతుందా? లోకం అనుకోవద్దూ?! అందుకే మంచి సంబంధం రాదంటాను."

'ఓరి అప్రాచ్యుడా... ఇలా తిప్పావా?!' అని గొణుక్కున్నాడు రామలింగం.

"పోన్లే బాబూ! మంచి సంబంధం రాకపోతే మానె- మంచి చదువు చెప్పిస్తాను. ఓ మంచి ఉద్యోగం చూసుకుని తన పొట్ట పోసుకుంటూ నన్ను కనిపెట్టుకుని ఉంటుంది."

"సర్లే... ఏదో సామెత చెప్పినట్లుంది! ఉద్యోగాలు చేస్తూ, పెళ్ళీ పెడాకులూ లేకుండా తిరిగే ఆడవాళ్ళ గురించి ఎన్ని వినడం లేదూ, ఎన్ని చూడ్డం లేదూ? ఏ ఆకాశ రామన్నతోనో, ఏ అవారా గాడితోనో 'ఉష్ కాకి' అంటూ ఎగిరిపోతే నీ గతేం కాను? అందువల్ల పైచదువుల ఆలోచన మానేయి!"

మైసయ్య మాటలకి కమలమ్మ కడుపు రగిలిపోయింది. పైకి ఏమీ అనలేక,

"ఇంతకీ... మీరు చెప్పేదేమిటి? నన్నేం చేయమంటారు?" అని అడిగింది.

"అలా అడిగావు బాగుంది! నా మాట విని సరోజకి పెళ్ళీ చేయవద్దు, చదువూ చెప్పించవద్దు!"

"కమలమ్మా బాగున్నావా? ఎప్పుడొచ్చావు? సరోజ ఎలా ఉంది?" అంటూ లోపల్నుంచి బయటకు వచ్చింది మైసయ్య కూతురు రాధిక.

"బాగానే ఉన్నాం అమ్మా!"

"దానికి మంచి చదువు చెప్పించు. దానికి చదువు బాగా వస్తోంది. అనవసరంగా చదువు మాన్పించి పెళ్ళి ప్రయత్నం చేయకు!" అంది రాధిక- తండ్రి వంక ఓరగా చూస్తూ.

"ఏం చేయాలో నీకంటే కమలమ్మకే బాగా తెలుసులే! లోపలకు పో... పానకంలో పుడక లాగా నువ్వేం రానక్కరలేదు!"

- అని కూతురి మీద గయ్యిమన్నాడు మైసయ్య.

"బాబుగారు ఇక్కడ దేవ రహస్యాలు చెప్తున్నారు... నువ్వు వినకూడదు. లోపలకు పో తల్లీ!" అన్నాడు రామలింగం.

రాధిక అతని వంకా, తండ్రి వంకా కొరకొరా చూస్తూ లోపలికి పోయింది.

"అన్నిటికీ తగుదుమమ్మా... అంటూ వస్తారు తల్లీకూతుళ్ళు!" అని గుర్రుమన్నాడు మైసయ్య. మొహం చాటుచేసుకుని నవ్వుకున్నాడు రామలింగం.

"మరి, ఏం చెయ్యమంటారు బాబుగారూ! త్వరగా చెప్పండి... నాకు వేరే పని ఉంది!" అంది కమలమ్మ అసహనంగా.

"ఓస్సోస్సి... దొరగారితో మాట్లాడ్డం కంటే వేరే ముఖ్యమైన పనేముంటుంది?" అన్నాడు రామలింగం.

"నువ్వూరుకో పంతులూ... మీరు చెప్పండి బాబూ!" అంది కమలమ్మ.

"నా మాట విని సరోజని జోగినిగా మార్చి ఎల్లమ్మ తల్లికి అంకితం చేయి! ఎంతో పుణ్యం చేసుకుంటేనే కానీ ఇలా కుటుంబం అంతా అమ్మవారికి అంకితం కావడం జరగదు."

"బాబుగారూ!" అప్రయత్నంగా గట్టిగా అరిచింది కమలమ్మ.

అతికష్టం మీద ఆవేశాన్ని అణచుకుంది. వీలుంటే పిల్లిలాగా ఒక్క ఉదుటున దూకి ఎలుక మెడ కొరికినట్లు, పులి ఒక్క పంజా విసురుతో లేడిపొట్టని చీల్చినట్లు మైసయ్యను అంతమొందించాలని ఉంది.

'ఇంతటి పవిత్రకార్యానికి ఆయన తన కూతురుని ఎందుకు అంకితం చేయకూడదు?' అని అడగాలనిపించింది. ఆ మాటలు పైకి అనలేక లోలోపలే శాపనార్థాలు పెట్టింది. తన అశక్తతకు లోలోపలే కుళ్ళికుళ్ళి ఏడ్చింది.

రాధిక మళ్ళీ బయటకు వస్తున్న అలికిడి విని, "నేను చెప్పింది బాగా ఆలోచించుకో కమలమ్మా!" అన్నాడు మైసయ్య.

కమలమ్మ ఏమీ మాట్లాడకుండా వెనుదిరిగి వెళ్ళిపోయింది.

●

"అలా ఉన్నావు ఏమిటమ్మా? ఏం జరిగింది?" అని అడిగింది సరోజ- కమలమ్మ ఇంటికి వెళ్ళగానే.

కూతుర్ని చూడగానే కమలమ్మకు దుఃఖం కట్టలు తెంచుకుంది. కూతుర్ని వాటేసుకుని భోరున విలపించింది.

జరిగిందేమిటో తెలీక బిత్తరపోయింది సరోజ. తర్వాత జరిగిందంతా చెప్పింది కమలమ్మ.

"అయితే నన్ను జోగినిగా మారుస్తావా అమ్మా?" అని భయంభయంగా అడిగింది సరోజ.

"నా కంఠంలో ప్రాణం ఉండగా అలా జరగదు. నువ్వు దిగులు పెట్టుకోకు."

"ఇటువంటి ఊళ్లో మనం ఉండొద్దమ్మా... ఎక్కడికైనా వెళ్లిపోదాం!"

"అదంత తేలిక్కాదమ్మా! ఒంటరిగా ఉన్న ఆడవాళ్ళకి ఎక్కడికి పోయినా కష్టాలు తప్పవు. ఉన్నచోటే ఉండి ఎదుర్కోవాలి!"

తల్లి పరిస్థితి చూసి తానే వంట చేయడానికి లోనికి వెళ్లింది సరోజ.

కమలమ్మకి తన గతం గుర్తుకువచ్చింది...

పదహారేళ్ల వయసులో తనని జోగినిగా మార్చింది తన తల్లి. జోగినులకు పసుపు కుంకుమలతో తిరిగే తల్లులుంటారు కానీ, 'ఫలానావాడు తండ్రి' అని చెప్పుకోవడానికి ఉండదు. జోగినిగా మార్చిన తర్వాత ఊరిపెద్ద ఎవరో చేరదీస్తాడు. వాడు ఎల్లమ్మ తల్లికి ప్రతినిధిట! అందువల్ల ఆ జోగినికి సంరక్షకుడట! ఆ జోగినితో అన్ని శారీరక సౌఖ్యాలూ అనుభవిస్తాడు- భార్యగా కాదు, ఉంపుడుకత్తెగా! అది మరీ నీచమైన పేరు కనుక 'ఫలానా వారి సంరక్షణలో ఉన్న జోగిని' అంటారు.

జోగినికి ఆడపిల్ల పుట్తే- యుక్తవయసు వచ్చాక ఆ అమ్మాయిని కూడా జోగినిగా మారుస్తారు. మగ పిల్లవాడు పుట్తే- కాలికి కడియం వేసి గణాచారిగానో, పోతురాజుగానో పెంచుతారు. ఉత్సవాలలో పూనకం తెచ్చుకోవడం లేదా వీరంగం ఆడడం వీరి పని. అయితే, ఏ దొర అయినా తాను ఉంచుకున్న జోగినికి ఒకరిద్దరు మించి సంతానం ఉండకుండా జాగ్రత్తపడతాడు.

కమలమ్మని కిషన్‌రావు దొర ఉంచుకున్నాడు.

అయితే, సరోజ పుట్టిన కొద్దికాలానికే పట్నానికి మకాం మార్చాడు. అక్కడ వ్యాపారం చేసి పెద్దసేఠ్ అయ్యాడు. ఆయన సొంతబిడ్డలకు మంచి సంబంధాలు చేశాడు. కొడుకులు పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు.

మరి, ఆయనకే పుట్టినా సరోజ గతి ఇలా ఉంది.

ఎవరిని అడగాలి? పట్నం పోయాక ఆయన ఊరికి తిరిగివచ్చింది లేదు, ముఖం చూపించిందీ లేదు. అటువంటి వాడు 'తండ్రి' అని చెప్పడం ఇష్టంలేక ఆ విషయాన్ని

దాచిపెట్టింది కమలమ్మ. ఆ నోటా, ఈ నోటా తన తండ్రి ఎవ్వరో తెలుసుకున్నా- ఆయనంటే ఏర్పడ్డ అసహ్యంతో 'తండ్రి' అన్న మాటనే తన మనసు నుంచి తుడిచేసుకుంది సరోజ.

కమలమ్మకి తనని జోగినిని చేసినరోజు గుర్తుకువచ్చి ఒళ్ళు జలదరించింది...

ఆరోజు పౌర్ణమి! తనని ఎల్లమ్మ తల్లి గుడి వెనుక ఆవరణలోకి తీసుకువెళ్లారు. ఆడవాళ్ళు చుట్టూ పర్దాలు కట్టారు. తర్వాత తనను పూర్తిగా దిగంబరంగా చేసి తలంటు పోశారు. ఆ తర్వాత ఒళ్ళంతా పసుపు పూశారు. ముఖానికి పెద్ద కుంకుమబొట్టు పెట్టారు. వివస్త్రగానే ఉంచి నడుం చుట్టూ, రొమ్ము చుట్టూ దట్టంగా వేపమండలు కట్టారు. బయటకు తీసుకువచ్చే ముందు అమ్మవారికి మేకపోతును బలి ఇచ్చారు. 'తనకీ, ఆ మేకకీ తేడా ఏమిటీ?' అనిపించింది. దాని ప్రాణం పోయింది. కాదు... తీశారు. తనకి ప్రాణం ఉన్నా, పోయినట్లే లెక్క!

తర్వాత...

ముందు కొమ్ముబూరలు ఊదుతూ, డప్పులు మోగిస్తూ గణాచారి గంతులతో తనని ఊరేగింపుగా ఊరిలోని పెద్ద వీధులన్నీ తిప్పారు. తిరిగి గుడిలోకి తీసుకొచ్చారు.

పూజారి తనను ఎల్లమ్మ తల్లి విగ్రహం ముందు నిలబెట్టాడు. ఏవో మంత్రాలు చదివాడు. "ఈరోజు నుంచి ఈమె ఎల్లమ్మ తల్లికి అంకితం అయిన జోగిని!" అని ప్రకటించాడు.

ఊరిపెద్ద, ఆయన భార్య వచ్చి జోగినిగా మారిన తనకు చీరా, రవికా, పూజారికి పంచెల చాపు పెట్టారు. తాను ఆలయం వెనక్కి వెళ్లి వేపమండలు తీసేసి కొత్తబట్టలు కట్టుకుంది.

అంతే... తాను 'జోగిని'గా స్థిరపడిపోయింది!

●

**ఆ** ఊరి ఆచారం ప్రకారం ప్రతి సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమికి ఎల్లమ్మ గుడిలో పెద్ద జాతర జరుగుతుంది.

ఆరోజు గణాచారికి పూనకం వస్తుంది... ఎల్లమ్మ దేవత అతన్ని ఆవహిస్తుందట! ఆ పూనకంలో ఆ సంవత్సరం ఎల్లమ్మ తల్లి ఎవరిని జోగినిగా కావాలనుకుంటుందో చెప్తాడు. ఇంక దానికి తిరుగు లేదు... ఆ పేరు వచ్చిన యువతి జోగినిగా మారి తీరవలసిందే! ఊరిపెద్దలు దేవి ఆజ్ఞ అమలు జరిగేటట్లు చూస్తారు. దేవి ఆజ్ఞను ధిక్కరిస్తే ఊరంతకీ అరిష్టమట! అందుచేత దానిని ఎదిరించడానికి ఎవరూ ధైర్యం చేయరు.

ఆరోజు ఎవరినైతే జోగినిగా చేయాలని గణాచారి ప్రకటిస్తాడో- ఆ అమ్మాయిని కార్తీక పౌర్ణమినాడు జోగినిగా మారుస్తారు.

జాతర జోరుగా జరుగుతోంది!

ఊరు ఊరంతా ఎల్లమ్మ గుడి దగ్గరే ఉంది. పీకల దాకా సారా పట్టిన పోతరాజులు చేతిలో కొరడా తాళ్ళు ఝుళిపిస్తూ గంతులేస్తున్నారు.

ఇంతలో... గణాచారి జనం మధ్యకు వచ్చాడు. అతనికి పూనకం వస్తోంది. మలేరియా రోగి లాగా "ఊఁ... ఊఁ..." అంటూ వణికిపోతున్నాడు. అటూఇటూ ఊగిపోతున్నాడు. కొందరు నిప్పుకుండలో సాంబ్రాణి, గుగ్గిలం వేసి ఆ పొగను గణాచారికి అద్దారు.

"చెప్పు తల్లీ... ఏం కావాలి?" అని అడిగారు వాళ్ళు.

"నాకు కొత్త కన్నెపిల్ల జోగినిగా కావాలిరా!" అంటూ మరింతగా ఊగాడు గణాచారి.

"ఏ కన్నెను జోగినిని చేయమంటావు? చెప్పు తల్లీ!" అన్నాడు ఇంకొకడు.

"కమలమ్మ కూతురు సరోజ నాకు కావాలిరా!" అన్నాడు గణాచారి.

"ఆ అమ్మాయి చదువుకున్న పిల్ల! జోగినిగా మారడానికి ఒప్పుకోకపోతేనో?" అన్నాడు ఇంకోడు.

"దానినీ, దాని తల్లినీ, ఊరు మొత్తాన్నీ నాశనం చేస్తానురో..!" అంటూ బిగ్గరగా, మరింతగా ఊగిపోతూ అరిచాడు గాణాచారి.

"అలాగే చేస్తాం తల్లీ!" అంటూ గణాచారికి మళ్ళీ ధూపం వేశాడు.

గణాచారికి పూనకం తగ్గింది. శాంతించాడు. మామూలు మనిషి అయ్యాడు.

'సరోజ' పేరు గణాచారి నోట వినబడగానే గుండె ఝల్లుమంది కమలమ్మకి. సరోజను గట్టిగా దగ్గరకు తీసుకుంది.

సరోజకి ఏడుపు ఒక్కటే తక్కువ! కమలమ్మ కన్నీళ్లకు కట్టలు వేస్తోంది!

ఇద్దరూ మౌనంగా ఇంటికి వెళ్లిపోయారు.

●

కార్తీక పౌర్ణమి వచ్చింది!

ఎల్లమ్మ గుడిలో జాతర మొదలయింది.

"కమలమ్మా! సరోజను ఇలా పంపించు... తలంటు పోయించాలి!" అని పూజారి అరిచాడు.

ఆ అమ్మాయిని తీసుకువెళ్లడానికి నలుగురు ముత్తయిదువులు ముందుకు వచ్చారు.

సరోజ తల్లిని మరింత గట్టిగా వాటేసుకుంది.

ఇంతలో... గణాచారికి పూనకం వచ్చింది-

"ఒరేయ్c... నాకు కొత్త జోగిని కావాలిరా!" అంటూ అరుపులు మొదలుపెట్టి విపరీతంగా ఊగిపోసాగాడు.

"చెప్పు తల్లీ... ఎవరు కావాలి?" అన్నాడు ఒకడు పొగవేస్తూ.

"నాకు ఊరి పెద్ద మైసయ్య కూతురు రాధిక కావాలిరా!" అని అరిచాడు గణాచారి.

ఊరి వారందరి మీదా ఉమ్మడిగా పిడుగు పడినట్లయింది. అంతటా మౌనం ఆవహించింది. ఆ షాక్ నుంచి మైసయ్య తేరుకోలేదు.

"సరిగ్గా చెప్పు తల్లీ... నీకు ఎవరు కావాలి?" అన్నాడు ఇంకొకడు.

"సరిగ్గానే చెప్పానురా! మైసయ్య కూతురు రాధిక జోగినిగా మారాలి!" అని గట్టిగా అరిచాడు గణాచారి.

●

"తప్పుడు నా కొడకా... తాగొచ్చి నోటికొచ్చినట్లు పేలుతున్నావేమిరా?!" అంటూ లేచాడు మైసయ్య.

"నన్నే ఎదిరిస్తావురా? నీ కూతుర్ని నాకు జోగినిగా ఇయ్యకపోతే నిన్నూ, నీ కుంటుంబాన్నీ సర్వనాశనం చేస్తాను!" మరింతగా ఊగిపోతూ అరిచాడు గణాచారి.

"ఒరేయ్c... నిన్ను మాటలతో కాదు-" అంటూ ముందుకి అడుగువేశాడు మైసయ్య.

"ఆగండి..." అంటూ బిగ్గరగా అరిచింది శాంతమ్మ.

అందరూ ఆశ్చర్యంగా అటు చూశారు.

"ఊరందరికీ ఒకటే న్యాయం! అవునా, కాదా..?" అని అడిగింది శాంతమ్మ.

"అవును. అందరికీ ఒకటే న్యాయం!" అని జనం అరిచారు.

"మరి, ఆరోజు సరోజ జోగిని కావాలని తల్లి చెప్పింది. అందుకు ఒప్పుకుని సరోజమ్మ వచ్చింది. ఈనాడు ఆ ఎల్లమ్మే రాధిక కావాలంటోంది. మరి, తల్లి మాట తప్పుతామా?"

"తప్పకూడదు!"

"అందుకే... రాధిక జోగినిగా మారుతుంది."

"శాంతా! నువ్వేమంటున్నావో తెలుసా?" అని అరిచాడు మైసయ్య.

"బాగా తెలుసు నాన్నగారూ! ఎల్లమ్మ తల్లి మీద భక్తితో నేను జోగినిగా మారదలచు కున్నాను" అంది రాధిక.

"రాధికా! నువ్వే ఇలా అంటున్నావా? ఇదంతా నాటకమమ్మా! ఎవరో గణాచారి గాడికి డబ్బులిచ్చి ఇలా అనిపిస్తున్నారు."

"మీలాంటి పెద్దలెవరో సరోజ విషయంలో కూడా వాడికి డబ్బులిచ్చి అనిపించి ఉండవచ్చుగా!"

"కావచ్చు. అయితే, ఒక పని చేద్దాం! ఈ జోగినిలుగా మార్చడాలని ఆపేద్దాం! నువ్వూ వద్దు, సరోజా వద్దు, ఎవరూ వద్దు."

"ఏం... నీ కూతురికి వచ్చేసరికి ఆచారాన్నే ఆపేద్దామంటున్నావేం! వీల్లేదు. అమ్మవారి ఆజ్ఞ ప్రకారం నేను జోగినిగా మారవలసిందే!"

"అవును. మీ అమ్మాయి జోగినిగా మారవలసిందే!" అని జనం అరిచారు.

"బాబూ! తప్పు ఒప్పుకుంటున్నాను. సరోజ మీద దుర్బుద్ధితో గణాచారికి డబ్బులు ఇచ్చి నాటకం ఆడించాను. నా బుద్ధి గడ్డి తింది... లెంపలు వేసుకుంటున్నాను" అని మొత్తుకున్నాడు మైసయ్య.

"మీరు డబ్బు ఇచ్చినట్లుగానే గణాచారికి నేను డబ్బు ఇచ్చి ఈ నాటకం ఆడించాను. ముల్లును ముల్లుతోనే తీయాలి కదా!" అంది శాంతమ్మ.

"జనులారా! ఇప్పటికైనా అర్థమయిందా! ఈ పూనకాలూ, ఎల్లమ్మ తల్లి కోరడాలూ అన్నీ నాటకాలు... అంతా బూటకం! స్వార్థపరులైన ఈ మైసయ్యలాంటి ఊరిపెద్దలు గణాచారి, పూజారిలాంటి వాళ్ళ దోసిట్లో డబ్బులు పోసి ఇలా నాటకాలు ఆడిస్తారు. ఒకప్రక్కన ప్రపంచం అంతా వైజ్ఞానికంగా ముందుకు పోతుంటే మనం ఇంకా ఈ మూఢాచారాలు పట్టుకుని వేలాడ్డం ఎంత సిగ్గుచేటు! ఈరోజు నుంచీ ఈ దురాచారం మన ఊరిలో లేకుండా చేద్దాం! మీరందరూ గౌరవంగా వెళ్లిపొండి.

మరో విషయం... ఈ జోగిని వ్యవస్థను ప్రభుత్వం నిషేధించింది. ఎవరినైనా జోగినిగా మార్చడం నేరం! మీలో ఎవరైనా మొండికెత్తి ఈ దురాచారాన్ని కొనసాగనియ్య దలచుకుంటే పోలీసులకు ఇంతకుముందే కంప్లయింటు చేసి ఉంచాను. ఒక్క ఫోన్ కొత్తే చాలు... వెంటనే వచ్చి దీనికి బాధ్యులైన వారిని అరెస్టు చేసి తీసుకుపోతారు... తెల్చుకోండి. దురాచారాన్ని నిర్మూలించామని సగౌరవంగా తలెత్తుకు తిరుగుతారో, అరెస్టయి తల

దించుకు జైలుకు వెళ్తారో మీ ఇష్టం! నామీద గౌరవం ఉంటే వెంటనే ఇక్కడ నుంచి వెళ్లిపొండి!" అంది రాధిక.

పది నిమిషాలు కాకుండా అక్కడ చేరిన జనం అందరూ తమ తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

"చిన్నదానివైనా నీ కాలికి మొక్కుతాను. నా బిడ్డను కాపాడిన ఎల్లమ్మ తల్లివి నువ్వు!" అంది కమలమ్మ- రాధిక కాళ్లు తాకబోతూ.

"అంతమాట అనవద్దు! దేవతను మనం ప్రేమమూర్తిగా కొలవాలే కానీ, ప్రజా కంటకురాలిగా మార్చకూడదు. ఇంక దిగులు మాని సరోజకు మంచి చదువు చెప్పించు!" అంది రాధిక.

"ఎంత పని చేశారు తల్లీకూతుళ్ళు!?" అన్నాడు మైసయ్య.

"మేము మంచిపని చేశాం! మీలాగా నీచమైన పని చేయలేదు. మీరు అమాయకురాలైన సరోజ మీద కన్నేసి గణాచారి ద్వారా ఈ నాటకం ఆడించారని తెలుసు. జోగినిగా మారడం ఇష్టంలేక ఆ తల్లీకూతుళ్ళు ప్రాణాలు తీసుకోవాలనుకున్నారు. అది తెలిసి రాధికను వాళ్ళింటికి పంపించి, ధైర్యం చెప్పించాను. లేకుంటే నిష్కారణంగా ఆ అమాయకులు మీ స్వార్థానికి బలి అయిపోయి ఉండేవారు. వాళ్ళ ఉసురు తగిలి అందరం సర్వనాశనం అయ్యుండేవాళ్ళం! ఎవరికైనా ప్రాణం పొయాలండీ... ప్రాణం తీయకూడదు. అప్పుడే ఊరిపెద్ద అయినందుకు మీ జన్మ సార్థకత!" అంది శాంతమ్మ.

"అమ్మా... కోట్లకు విలువైన మాట అన్నారు!" అన్నాడు రామలింగం.

"రామలింగం! ఏ రోటి పాట ఆ రోటి దగ్గర పాడడం ఆపేసి- న్యాయానికీ, ధర్మానికీ మాత్రమే వంతపాడడం నేర్చుకోవయ్యా!" అంది రాధిక.

"చిత్తం... ఇంత జరిగాక కూడానా!" అన్నాడు రామలింగం.

*'ఇండియా టుడే' వారపత్రిక . . . 25 – 31 అక్టోబర్, 2000*

అమ్మకానికి అందుబాటులో ఉన్న
కె.ఆర్.కె. మోహన్ ఇతర రచనలకై ఈ పుస్తకం చివరిపేజీల్లో చూడండి...